నమస్తే తెలంగాణ

మెదక్

I హైదరాబాద్, బుధవారం 31 జూలై 2024 | MEDAK




వర్గల్ మండలం గౌరారం సమీపంలో సంగారెడ్డి-రామాయంపేట్ కెనాల్



సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో నీళ్లు లేక ముదిరిన నారు

# కాళేశ్వరం జలాల కోసం ఎదురుచూపు

- నీళ్లులేక ఎండిన కాలువలు
- తగ్గిన భూగర్భ జలమట్టం
- కూడవెల్లి, హల్దీవాగుల్లో నీళ్లు రాక రైతుల ఇబ్బందులు

గజ్వేల్, జూలై 30: వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టం తగ్గింది. రైతుల బోర్లలో అనుకూలంగా నీళ్లు రాక మడులు తడవక నాట్లు వేయడం ఈ సంవత్సరం రైతులకు గగనంగా మారింది. నాట్లు వేసేందుకు అనుకూలమైన కార్తెలు గడుస్తుండగా నేటికీ వర్షాలు పడక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చెంతనే మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టులు ఉన్నా రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టక రైతులు దిగులుపడుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి కొండపోచమ్మ ప్రాజెక్టును నింపుకొని దాని ద్వారా రైతాంగానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో సాగు నీరు అందించింది. దీంతో రైతులు వరి, కూరగాయ పంటలు సాగు చేసుకొని జీవనం కొనసాగించారు. ఈ యేడు అందుకు పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. భూగర్భ జలమట్టం తగ్గడంతో రైతులకు సాగు పెద్ద సమస్యగా మారింది. 50టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా కొండపోచమ్మ ప్రాజెక్టులోకి వెళ్లే కాలువ నుంచి గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద కూడవెల్లి వాగులోని ఒక టీఎంసీ కాళేశ్వరం జలాలను వదిలితే గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో రైతులకు ఉపయోగకరంగా ఉండడంతో పాటు లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములు సాగులోకి వస్తాయి. కూడవెల్లి ప్రవాహం కరీంనగర్ జిల్లాలోని అప్పర్‌మానేరు వరకు వెళ్లడంతో రైతులు వరిసాగు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. వర్షాకాలంలో ఒక టీఎంసీ నీటిని వదిలితే రైతులు సాగు చేసే పంటలకు జీవంపోసినట్లు అవుతున్నది.15టీఎంసీల సామర్థ్యం కలిగిన కొండపోచమ్మ ప్రాజెక్టు సంగారెడ్డి కాలువ ద్వారా ఒక టీఎంసీ నీటిని వదిలితే హల్దీవాగు మీదుగా నిజాంసాగర్ వరకు ప్రవాహం ఉండడంతో పాటు హల్దీవాగుపై ఉన్న చెక్‌ డ్యాముల్లో నీటి నిల్వతో రైతులకు సాగు నీరు అందనున్నది. వర్గల్, తూప్రాన్, వెల్దుర్తి, మెదక్ మీదుగా నీటి ప్రవాహం కొనసాగనున్నది. రైతులు వరినాట్లు వేయాలంటే తప్పక కాలువల ద్వారా సాగునీళ్లు వదలక తప్పదు. నేటికీ 50శాతం కూడా వరినాట్లు పడలేదు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే కాళేశ్వరం కాలువలోకి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2న రాజీవ్, జాతీయ రహదారులను దిగ్బంధిస్తామని వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



నీళ్లు లేక బోసిపోయిన సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్



నాచు మొక్కలు, తుంగతో దర్శనమిస్తున్న రామాయంపేట్ కెనాల్



వర్గల్: కెనాల్ కింద ఇంకా వరినాట్లు వేయని పొలాలు



తుర్కపల్లి కెనాల్‌లో నీళ్లు లేని పరిస్థితి

## ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

### కాళేశ్వరంలో పుష్కలంగా నీళ్లు ఉన్నా సుక్కబొట్టు లిఫ్ట్ చేయడం లేదు



వర్గల్ మండలం సింగాయిపల్లి వద్ద రైతులతో కలిసి నిరసన చేపడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

- మండుటెండల్లో గోదావరి జలాలను పారించిన ఘనత కేసీఆర్‌దే..
- మొగులుకు మొఖం పెడుతున్న రైతులు
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి
- సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయిపల్లి లింక్ కెనాల్ వద్ద రైతులతో కలిసి నిరసన

వర్గల్,జూలై 30: కక్షసాధింపు చర్యలు మానుకోవాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.మంగళవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సింగాయిపల్లి వద్ద గల కొండపోచమ్మసాగర్ రామాయంపేట్, సంగారెడ్డి లింక్‌పాయింట వద్ద రైతులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలేశ్వరంలో పుష్కలంగా నీళ్లు ఉన్నా సుక్కబొట్టు ఎత్తిపోస్తలేరని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిత్య ప్రవాహంలా మారిన కూడవెల్లివాగు, రామాయంపేట్ కెనాల్, సంగారెడ్డి కెనాల్, హల్దీ వాగుల్లో ఇప్పుడు బొట్టునీళ్లు లేవన్నారు. కాంగ్రెస ప్రభుత్వ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. రైతు పంటరుణమాఫీలో అనేక కొర్రీలు పెట్టిన ప్రభుత్వం రైతుబంధు మాటే విస్మరించిందన్నారు. కేసీఆర్ కష్టపడి ప్రాజెక్టులు కట్టిస్తే సీఎం రేవంత్‌రెడ్డి నీళ్లు ఎందుకు ఇస్తలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తన తెలంగాణను ఎడారిగా మార్చే కుట్రచేస్తున్నదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు అడ్రస్ లేకుండా పోయిందన్నారు. వానకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్నా కాలువల ద్వారా సాగునీరు ఇవ్వక రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఆయా మండలాల్లో వరినాట్లు ఇంకా పూర్తికాలేదని మొగులుకు మొఖం పెట్టిచూస్తున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయా ప్రాజెక్టుల ద్వారా రైతాంగానికి నీళ్లివ్వకపోతే త్వరలోనే వేలాది మంది రైతులతో రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులతో కలిసి వరినాట్లు వేయని పొలాలు, నీరులేకబోసిపోయిన కెనాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఆయా గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## నీళ్లు లేవు ..ఎవుసం ఎట్లా చేయాలే?



మిరుదొడ్డి, జూలై 30 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నప్పుడు మల్లన్న సాగర్ ప్రాజెక్టులో నీళ్లు ఉంచినప్పుడు మా బోరు బాగా పోసేది. ఇప్పుడు మల్లన్న సాగర్ ప్రాజెక్టులో నీళ్లు లేక ఎండి పోతున్నది. దీంతో కూడవెల్లి వాగులోకి నీళ్లు విడుదల చేయలేదు. బోర్లు నీళ్లు పోయక వరి నాట్లు ఎట్లా వేయాలో అర్థంకావడం లేదు. బోర్లు పోస్తున్న కొద్ది నీళ్లతో రెండు మూడు మడుల్లో వరినాటు వేసుకుంటున్నాం. ప్రభుత్వం మల్లన్నసాగర్‌లోకి గోదావరి నీళ్ల నింపి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాం.

- లింగాల శివారెడ్డి, రైతు, మిరుదొడ్డి, సిద్దిపేట జిల్లా

## చెరువులు, కుంటల్లోకి నీళ్లు రాలేదు



మిరుదొడ్డి, జూలై 30 : కూడవెల్లి వాగులో నీళ్లు ఉంటేనే మా బోరు పోస్తది. మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుంచి కూడవెల్లివాగులోకి నీళ్లు విడుదల చేయక యాసంగిలో వరి పంట కూడా ఎండిపోయింది. ఇప్పటికే వానకాలం సగం అయిపోయింది. చెరువులు, కుంటల్లోకి నీళ్లు రాలేదు. కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్లు తెచ్చి మల్లన్న సాగర్‌ను నింపడంతోపాటు కూడవెల్లివాగుతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపితే బోర్లు ఊరుతాయి. మల్లన్నసాగర్‌లోకి రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు తెచ్చి రైతులను ఆదుకోవాలి.

-స్వామి, రైతు మిరుదొడ్డి, సిద్దిపేట జిల్లా

## కూడవెల్లిలోకి సాగునీళ్లు వదలాలి



గజ్వేల్, జూలై 30: మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం వెంటనే కొడకండ్ల వద్ద నిర్మించిన కాలువ ద్వారా కూడవెల్లి వాగులోకి సాగునీళ్లు వదలాలి. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు నేటి వరకు సరిగ్గా పడక భూగర్భ జలమట్టం తగ్గింది. బోర్లలో నీళ్లు తక్కువగా వస్తున్నాయి. చాలా మంది రైతులు వరినాట్లు వేయలేదు. కూడవెల్లి ద్వారా కాళేశ్వరం జలాలను వదిలితే చెక్‌డ్యామ్‌లు నిండుతాయి. రైతులకు న్యాయం జరుగుతది. కాళేశ్వరం జలాలను వదిలేందుకు ప్రభుత్వం ముందుకొచ్చి నీళ్లిచ్చి రైతులను ఆదుకోవాలి.

- నరేశ్ గౌడ్, కొల్గూర్, గజ్వేల్ మండలం, సిద్దిపేట జిల్లా

## వరి నాట్లు వేయలేదు



గజ్వేల్, జూలై 30: సీజన్‌కు ముందే గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంగారెడ్డి కాలువలోకి నీళ్లు వదలడంతో హల్దీవాగులో ఎప్పుడూ నీళ్లు ఉండేవి. రైతులందరూ వరిసాగు చేసేది. ఇప్పటికీ వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలమట్టం తగ్గడంతో బోర్లు తక్కువగా పోస్తున్నాయి. బోర్లలో నీళ్లు రాకపోవడంతో చాలా మంది రైతులు ఇప్పటి వరకు వరినాట్లు వేయలేదు. కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి కాళేశ్వరం జలాలను విడుదల చేస్తే చెక్‌డ్యామ్‌లో నీళ్లు పుష్కలంగా చేరి బోర్లకు ఉపయోగకరంగా ఉంటుంది. గత ప్రభుత్వం ఎప్పుడూ రైతుల మేలు కోసమే ఆలోచించేది. ఈ ప్రభుత్వం రైతులకు కనీసం సాగునీళ్లు ఇవ్వడం లేదు.

- చింతల రాములు, దండుపల్లి, వర్గల్ మండలం, సిద్దిపేట జిల్లా

## బోరు మోటరే దిక్కు



మర్కూక్, జూలై 30: బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొండపోచమ్మ ప్రాజెక్టును నింపి కాలువల ద్వారా నీళ్లు ఇచ్చేది. ఐదారేండ్ల నుంచి ఐదు ఎకరాల్లో వరి నాటు వేశా. రెండు పంటలకు సంబంధించి నీళ్లకు ఇబ్బంది లేకుండా ఉండేది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు నింపలేదు. కాలువలో నీళ్లు లేక బోరు మోటరే దిక్కయింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

- పత్తి రమేశ్,రైతు, దామరకుంట, మర్కూక్ మండలం సిద్దిపేట జిల్లా

## హల్దీవాగులోకి నీటిని వదలాలి



తూప్రాన్, జూలై 30: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండుటెండల్లో కూడా గోదావరి నీళ్లు పారేవి. ఇప్పుడు హల్దీవాగు పూర్తిగా ఎండిపోయింది. కేసీఆర్ ఉన్నప్పుడు పుష్కలంగా వర్షాలు కురిసి కాలం బాగా అయింది. గోదావరి జలాలు కూడా హల్దీవాగులోకి వదిలేవారు. వాగు నుంచి వేసుకున్న పైప్‌లైన్ ద్వారా పంట పొలాలు పండేవి. కానీ ఈసారి కాలం వెనక్కి వెళ్లింది. వర్షాలు పడే సూచన కనిపిస్తలేదు. హల్దీవాగుకు నీటిని వదలకపోతే పొలాలు పూర్తిగా ఎండిపోతాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి హల్దీ వాగులోకి గోదావరి నీళ్లను వదలాలి.

- వట్యాకుల సురేందర్‌రెడ్డి, రైతు, యావాపూర్, తూప్రాన్ మండలం, మెదక్ జిల్లా

## చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



తూప్రాన్, జూలై 30: ఆబోతుపల్లి వాగు గడ్డకు ఎనిమిది ఎకరాల పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. నీళ్లకోసం ఎదురుచూసిన సందర్భాలు ఇంతకు ముందు ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు వర్షాలు పడక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితిని చూస్తే వర్షాలు పడేలా కనిపించడంలేదు. దేవుడి మీద భారం వేసి పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తున్నా. వ్యవసాయానికి వాగు నీళ్లు తప్పా వేరే ఆధారం లేదు. వర్షాల కోసం చూసీ చూసీ ఇప్పుడు దున్న కాలు మొదలు పెట్టా. గోదావరి నీళ్లను వెంటనే హల్దీవాగులోకి వదిలి చెక్‌డ్యాములు నింపినా వ్యవసాయం ముందుకు సాగుతది. నీళ్లు వదలకపోతే మా పరిస్థితి ఆగమే.

- లంబ నరేందర్ యాదవ్, కౌలు రైతు, తూప్రాన్, మెదక్ జిల్లా

## విద్యార్థులు వ్యవసాయ రంగంలో రాణించాలి




కౌడిపల్లి విజ్ఞానజ్యోతి స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న సురేశ్‌బాబు

కౌడిపల్లి, జూలై 30: విద్యార్థులు వ్యవసాయ రంగంలో రాణించాలని సినీ నిర్మాత సురేశ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి రామానాయుడు విజ్ఞానజ్యోతి 29వ స్నాతకోత్సవం నిర్వహించి ఆరునెలలు వ్యవసాయరంగంలో ఉచిత శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామాలకు వెళ్లి తోటిరైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయరంగంలో మేలురకం వంగడాలను సాగుచేయాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై మొగ్గు చూపే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞానజ్యోతి అడ్వైజర్ కమిటీ చైర్మన్ అచ్యుతరామ్‌ప్రసాద్, డైరెక్టర్ అర్జున్‌రావు, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, న్యూజివీడు సీడ్ జనరల్ మేనేజర్ శేషగిరిరావు, నాగర్‌కర్నూల్ అగ్రికల్చర్ జిల్లా అధికారి చక్రపాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు

సంగారెడ్డి,జూలై 30:ప్రయాణికులను నిత్యం గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్రం అవార్డులను హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పురుషోత్తంనాయక్ అందజేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ డిపో పరిధిలో మెదక్ రీజియన్ పరిధిలోఎంపికైన 28మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులతోపాటు రాష్ట్ర స్థాయి అవార్డులు వచ్చిన సందర్భంగా అభినందించారు. అనంతరం నేడు ఉద్యోగ విరమణ చేయనున్న హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్‌ను ఆర్టీసీ ఉద్యోగులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రగతి అవార్డులకు ఎంపికావడం వారి పనితనానికి నిదర్శనమన్నారు. ప్రమాద రహిత వారోత్సవాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు డ్రైవర్లకు ప్రమాద రహిత అవార్డులు అందజేయడం సంతోషకరమన్నారు. మెదక్ రీజియన్ పరిధిలోని 8 డిపోల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామికులు, మెకానిక్‌లను అభినందించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఎస్తర్ ప్రభులత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్స్ దైవాదీనం, డిపో మేనేజర్లు ఉపేందర్, మల్లేషయ్య, సుఖేందర్‌రెడ్డి, జాకీర్‌హుస్సేన్, సురేఖ సిబ్బంది పాల్గొన్నారు.



సంగారెడ్డిలో ఉద్యోగులకు ఉత్తమ ప్రతిభ అవార్డులు అందజేసిన అధికారులు

# పంట రుణమాఫీ గందరగోళం

- అయోమయంలో రైతులు
- రెండు విడతలు కలిపి ఉమ్మడి జిల్లాలో 2,32,014 మంది రైతులకు రూ.1,596.38 పంట రుణమాఫీ



సిద్దిపేట, జూలై 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రెండో విడత పంటరుణమాఫీ అంతా గందరగోళంగానే ఉన్నది. మొదటి విడత ఎలా ఉందో రెండో విడత కూడా అలానే ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు పెట్టి రెండో విడతలో కూడా చాలామంది రైతులకు పంటరుణమాఫీ కాలేదు. పంటరుణమాఫీ అవుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. లక్షన్నర వరకు ఉన్న రైతులకు పంటరుణమాఫీ చేశామని గొప్పలు చెప్పింది కానీ ఆచరణలో సాధ్యం కాలేదు. ఒక కుటుంబంలో లక్షన్నరలోపు ఉన్న వారికి మాత్రమే పంట రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. వీటిలో కూడా చాలా మందికి మెసేజ్‌లు రాలేదు. రెండో విడత పంటరుణమాఫీకి సంబంధించిన జాబితాలను అధికారికంగా బ్యాంకు వాళ్లు విడుదల చేయలేదు. అటు వ్యవసాయ శాఖ అధికారులు సైతం పంచాయతీలు, రైతు వేదికల వద్ద ప్రదర్శించలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు పంటరుణమాఫీ కట్ చేశారు. కుటుంబంలో ఏ ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా పంటరుణ మాఫీ కట్ అయినట్లు ఆ కుటుంబ రైతులు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు విడతలు కలిపి ..సిద్దిపేట జిల్లాలో 79,721 మంది రైతులకు రూ. 558.61, మెదక్ జిల్లాలో 74,342 మంది రైతులకు రూ. 473.78, సంగారెడ్డి జిల్లాలో 77,951 మంది రైతులకు రూ. 563.99 మొత్తం ఉమ్మడి జిల్లాలో రెండు విడతలు కలిపి 2,32,014 మంది రైతులకు రూ.1,596.38 రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది.

**ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒకటి, రెండో విడత పంట రుణమాఫీ వివరాలు**

| జిల్లా పేరు | ఒకటో విడత | | రెండో విడత | | మొత్తం | |
|---|---|---|---|---|---|---|
| | రైతులు | రూ. | రైతులు | రూ. | రైతులు | రూ. |
| సిద్దిపేట | 51,846 | 281.40 | 27,875 | 277.21 | 79,721 | 558.61 |
| మెదక్ | 51,492 | 252.63 | 22,850 | 216.15 | 74,342 | 473.78 |
| సంగారెడ్డి | 50,702 | 277.23 | 27,249 | 286.76 | 77,951 | 563.99 |
| ఉమ్మడి జిల్లా | 1,54,040 | 811.26 | 77,974 | 780.12 | 2,32,014 | 1596.38 |

## లెక్చరర్ కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

మునిపల్లి, జూలై 30: లెక్చరర్ కోసం విద్యార్థులు రోడ్డెక్కారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని లింగంపల్లి గురుకుల కళాశాలలో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థులు బదిలీపై వెళ్లిన లెక్చరర్‌ను తిరిగి పంపించాలంటూ ముంబయి జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ..లింగంపల్లి గురుకుల కళాశాలలో తెలుగు బోధించే లెక్చరర్ వెళ్లిపోవడం చాలా బాధాకరమన్నారు. లెక్చరర్లు నచ్చచెప్పి ధర్నా విరమించేలా చేసి హాస్టల్‌కు తీసుకెళ్లారు. లెక్చరర్‌ను తీసుకొచ్చేందుకు ప్రిన్సిపాల్ ప్రయత్నం చేస్తున్నారని విద్యార్థులకు భరోసా కల్పించారు. విద్యార్థులు ధర్నా విరమించి పరీక్షలకు హాజరయ్యారు. ధర్నాచేస్తున్న విద్యార్థులకు తల్లిదండ్రులు మద్దతు పలికారు.



మునిపల్లి: ముంబయి జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న లింగంపల్లి గురుకుల కళాశాల విద్యార్థులు



సిద్దిపేట జిల్లాలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయం

## బెక్కల్ ఆలయ భూములపై విచారణ చేపడుతాం

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి
- 'నమస్తే తెలంగాణ' కథనంపై సర్వత్రా చర్చ

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 30: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి భూ ముల అన్యాక్రాంతంపై 'బెక్కల్ ఆలయ భూమికి ఎసరు' అనే కథనం 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైనది. సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి స్పందించి బెక్కల్ ఆలయ భూ ములపై సమగ్రంగా విచారణ చేయిస్తామని 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'కి ప్రత్యేకంగా తెలియజేశారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ భూములతోపాటు ఆలయానికి దాతలు ఇచ్చిన భూమి కొన్నేండ్లుగా అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని, దీనిపైన అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని బెక్కల్, బైరాన్‌పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశా రు. 'నమస్తే తెలంగాణ' కథనంపై ఈ ప్రాంతంలో పెద్దఎత్తున చర్చ కొనసాగుతున్నది. అన్యాక్రాంతమైన ఆలయ భూముల విషయాన్ని 'నమస్తే తెలంగాణ' బయటకు తీసుకురావడాన్ని రామలింగేశ్వరస్వామి భక్తులు ప్రత్యేకంగా అభినందించారు.